


# సర్వత్రా, సర్వదా, సర్వధా

కనుకోల్ల హనుమంతరావు

మా మేనకోడలు శైలజ తన ఆటో గ్రాఫులో సంతకం పెట్టమన్నది.

'నేనెందుకు? తల్లీ. పెద్దాళ్ల చేత పెట్టించుకోవాలి, కాపీ' అని చెప్పబోయాను.

'నీవు పెద్దాడివేగా మావా' అంది మాటలమూట. 'పెద్ద' అన్న పదానికి 'గొప్ప' అన్న నానార్థము వున్నదని దానికింకా తెలీదు.

సరే నని, ఆలోచించి 'తోటివారిని ప్రేమించు' అని వ్రాశిచ్చాను.

'మరొకటి మావా...' అని చిన్నది ప్రాధేయపడింది.

'ఎక్కడ్నుంచి వూడిపడుతాయే, వ్రాయటానికి' అంటూ.

'నీలోని మంచిదనం,
నిస్సహాయుల కవుసరం.
మంచిదనం పీ [illegible]
మడిగట్టుక కూచుంటే
శుష్కించిన న్యాయానికి
దిక్కెక్కడ, మొక్కెక్కడ?
పొగరెక్కిన అన్యాయం,
పొంగకుండా వుండలేదు.
పొంగుజారు కలుగజేసి,
పొందు పుడమిని మంచిపేరు.'

అని వ్రాసి దాన్ని సమాధాన పర్చాను.

'మరొకటి మావా...' అని కొసరింది.

'ఇహ చాలు, వూరుకో' అంటూ మా చెల్లెలు, మేనకోడలి నాలుకకి తాళంవేసింది.

'నేనీసారి వచ్చినపుడు మూడోసారి ముచ్చటగా వ్రాస్తానుగా' అని అభయమిచ్చాను, దాన్ని చిన్నబుచ్చడ మెందుకని.

'అలాకాదు. నీవు నెల్లూరుచేరాక నాకు వెంటనే వ్రాశిపంపాలి' అని శాసించింది.

'హోకే' అని కంపార్టుమెంటులోకి అడుగుపెట్టాను.

సంసారభారం ఒంటరి ఇల్లాలికి అప్పజెప్పి దూరదేశానికి బయలుదేరిన ఆఫీసరులాగ, రైలు ఢిల్లీవదిలి మద్రాసుకి దిగులుగా బయలుదేరింది. తన కెదురొచ్చే ప్రకృతి సౌందర్యాన్నంతటినీ అనుభవించి వెనక్కి నెట్టేస్తూ, కిన్నెరసౌందర్యం అనుభవించేందుకని ఉరకలెత్తిన సముద్రునిలాగ రైలు చరచరా వెళ్లిపోతున్నది ఈ రోజుల్లో దూరప్రయాణాలు అంత బాధకరంగా లేవు, సగానికి సగం వ్యవధిలో రైళ్లు తమ తమ గమ్యస్థానాల్ని చేరుకొంటున్నా, జనం మాత్రం రైళ్లు మందకొడిగా నడుస్తున్నాయని, విమర్శనలు చేస్తూనే యున్నారు; ఎన్ని కోర్కెలు తీర్చినా, ఎన్ని ఋజువులు చూపినా భక్తి కుదుర్చుకోలేని నాస్తికుల్లాగ.

మేము ఎక్కిన 'జనతా ఎక్స్‌ప్రెస్'ని 'కన్నతల్లి'లా ఆహ్వానించింది, ఇటార్సీ స్టేషన్ ప్లాట్‌ఫారం. నాతో ఢిల్లీనుంచి ప్రయాణంచేస్తున్న రామానుజంగారు మంచి నీళ్లు మరచెంబులో నింపుకోవటానికని రైలుదిగారు. గిట్టేవాళ్ల సంఖ్యకంటే, పుట్టేవాళ్లసంఖ్యే ఎక్కువా? అన్న అనుమానం బలపరుస్తున్నట్లు, రైలు దిగేవాళ్ల సంఖ్యకంటే, ఎక్కేవాళ్ల సంఖ్యే ఎక్కువగా వుంది. అందులోనూ 'దరిద్రుడికే సంతానం ఎక్కువ'న్నట్లు అన్‌రిజర్వుడు థర్డ్‌క్లాస్ బోగీలోనే స్క్వేర్‌ఫుట్ ఆవరణలో సలుగురు చొప్పున జనం క్రిక్కిరిసి యున్నారు. బ్రతికేదెట్లు ? ప్రయాణం, తలపెట్టక పోయినా బాగుండేడిది. హఠాత్తుగా ప్రయాణం పెట్టుకుంటే 'డబ్బుపోయె, సుఖంపోయె' అన్న పరిస్థితి ఏర్పడుతుంది.

'కన్నతల్లి' వొడిలో విశ్రమించాక చనరాక చనినట్లు రైలు మందంగా బయిలుదేరింది రామానుజంగారు జారిపోయే పంచని సరిచేసుకొంటూనే రైలందుకొన్నారు. ఆయన శ్రీ తాతాచార్యులవారి పోలికల్ని నూటికి నూరుపాళ్లు గుత్తకు పుచ్చుకొన్నారు. ఢిల్లీలో స్థిరపడి పదేళ్లు కావస్తున్నది. మరో నలుబదేండ్లు గడచినా తన 'సహజ సంపత్తిని' పోగొట్టుకొనే అవివేకుడు కాదని తెలుస్తూనే యుంది. హిందీ అరవస్టైలిలో మాట్లాడుతారు. ఇంగ్లీషులో మంచి ప్రవేశముంది. మంచి పొడగరి. ఎదుటివారినుంచీ గౌరవం ఇట్టే పుచ్చుగోగలరు. అది వారి అదృష్టం. ఆయున పన్నూ ఆకర్షించారు.

ఆయన రైల్లోకి తిరిగివచ్చిన క్షణం 'అందమయిన కోతిపిల్ల, మా అరవ (ఫ్రెండు' అని ఒక కంఠం పూర్తి ఆంధ్రత్వంతో గానంచేశింది.

'బెజవాడ చేరేలోగా వీడినొక ఉడుకు ఉడికిద్దాం, రా...'అని మరో కుర్రాడి కంఠం వంతపాడింది. బహుభాషా కోవిదుల కయినా సరిహద్దు రాష్ట్రభాషలు రాకపోవడం, కద్దు. కుర్రాళ్లు ఏమి పేలుతున్నారో, రామానుజంగారికి బోధపడలేదు

రైలువేగం పుంజుకుంటున్న కొద్దీ, ప్రయాణికులమధ్య సహకారము ఏర్పడుతూ వుంది. రామానుజంగారు తనకి 'నక్షత్రైటు దురాక్రమణ' పద్ధతిరాక, న్యాయంగానే లభ్యమైన జాగాలో కాళ్ళుజాపి సదుపాయంగా కూర్చొన్నారు—ఆ యిద్దరి కుర్రాళ్లల్లో అప్పారావుకంటికి రామానుజంగారి సుఖము నలుసయింది.

'ఇదిగో, రంగారావోయ్. ఆ అరవ సన్నాసిని కాళ్ళు ముడుచుకోమను. వాడబ్బ చోటులాగ ఏమిటా దర్జావాలకం, వాడూనూ? ఏయ్! నిన్నే—సర్దుకో...' మర్యాదలేని కంఠం! తెలుగుభాష వీడికెందుకు వొంటబట్టిందని విచారించేను. మర్యాద పట్టికుగా ఖూనీ కావటం సహించలేకపోయాను. వీడి పొగరు అణచడానికి ఎవరో ఈపాటికి అవతారమెత్తేయుంటారు. దుష్టుడికి నోరే బలము. ఏం చేస్తాం? అని సరిపెట్టుకొన్నాను. రామానుజంగారికి అదృష్టవశాత్తూ ఈ గొడవింకా అర్థం కాలేదు.

రాత్రి భోజనాల సమయం. డైనింగ్ కారులో మాకిద్దరికీ ఎదురుగ్గా అప్పారావు, రంగారావులు వచ్చి కూర్చున్నారు. సంభాషణ మళ్లీ మొదలు; నాకు వినబడేటట్లు, రామానుజంగారికి తెలిసేటట్లు.

రంగారావు: డైనింగ్ కారులో వంటకాల స్టాండర్డు పడిపోయిందోయ్. ఈ అరవల మేనేజిమెంటునుంచి బయటపడితేనే తప్ప, ఆంధ్రులకి సరయిన భోజనం ఏర్పడదు. ఏ రూట్లో చూచినా, వీళ్లే!

అప్పారావు: అవునయ్యా! భోం చేస్తున్నా ఎదుటగా ఈ కోతులే ప్రత్యక్షం.

నేను సహనం కోల్పోయాను. 'ఇక్కడ కోతులెక్కడున్నాయి. మనుష్యుల్ని కూడ పోల్చుకోలేకుండా యున్నారు. కుర్రాళ్లు పాపం! కళ్లదోషం వున్నట్లుంది. డాక్టరుకి చూపించుకోండి' అని ఉచిత సలహా

తల్లినుండి పిల్లకు పారంపర్యా 'వుడ్ వార్డ్స్', వార్త వాడుకగా వస్తోంది

మీ శిశువును

వుడ్ వార్డ్స్

గ్రైప్ వాటర్‌తో

ఆరోగ్యంగాను, ఆనందంగాను వుంచండి

తరతరాలనుంచి తెలివైన తల్లులు తమ శిశువులకు 'వుడ్ వార్డ్స్' గ్రైప్ వాటర్‌ను వాడియున్నారు. వుడ్ వార్డ్స్' కడుపులో పట్టు నొప్పి, పైత్యం, వాయువు మరియు పళ్ల వచ్చునప్పటి జబ్బులు, ఈ బాధల నుండి తక్షణ విముక్తి కలిగిస్తుంది.



సురక్షితంగా వుండండి.
నిద్ధరంగా వుండండి.
సర్వదా ఒక సీసాను
దగ్గిరుంచుకోండి.




వుడ్ వార్డ్స్' గ్రైప్ వాటర్
తెలివైన తల్లులు
వంద ఏళ్లకు మించి
వాడుచున్నారు.

AT. 30 TL

దేహపుష్టికి
ఆరోగ్యానికి
పండిత-డి గోపాలాచార్యులవారి
జీవామృతం
1898 నుండి ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం,
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17.

వాయిదాల చెల్లింపుపై ట్రాన్సిస్టరు

వెల రూ. 165/-
(గ్యారంటీతో)
నెలకు రూ. 5/-
వంతున చెల్లించి,
3 బ్యాండ్ ఆల్ వరల్డ్ పోర్టబుల్ ట్రాన్సిస్టర్ పొందండి. ప్రతి గ్రామానికి పట్టణమునకు పంపగలము. వివరములకు నేడే వ్రాయండి:
SHEBA SALES (23)
Roop Nagar, Delhi-7.

ఏమోయ్ కమల నీవు
రోజూ అందమైన వస్త్రములు
ధరించెదవు. ఎక్కడ కొంటావు?

నేను వస్త్రములు కావలసినచో
అశోక్ స్టోర్సు (విజయవాడ)
కు వెళ్లెదను. వారు ప్రతిరోజూ
సరిక్రొత్తరకములు తెప్పించెదరు.



ఇచ్చాను.

'మీ దేవూరు?'

'నెల్లూర'న్నాను.

'అందుకే, అరవ తంబి పొడగిట్టింది. ఎంతయినా మీరూ సాంబార్‌వాళ్లే' నని రంగారావు హేళన చేశాడు.

ముద్ద నోట్లో వుండగానే నవ్వినందుకు అప్పారావుకి పొరబోయింది. 'అంతగా నవ్వించబోకోయ్' అని రంగారావుని వేడుకొన్నాడు.

నేనూ వాళ్లనిఅంతటితో పోనివ్వలేదు. 'నేను సాంబారు త్రాగనని చెప్పడంలేదు. అయినా తెలుగు గడ్డ మీదే పుట్టాను. దేశంలో ఆవకాయ, సాంబారు రుచి చూడని వారెవరయినా యుంటారా? ఆ రెండూ విజానికి 'ది బెస్ట్ ఇంటిగ్రేషన్ ఫోర్సస్' ఇన్ అవర్ నేషనల్ లైఫ్' (జాతీయ సమైక్యతకి సహాయకారులు) అని నా అభిప్రాయం. మీ లాంటి బొడ్డువిడని అమాయకులికి ఎలా తెలుస్తుంది లెండి' అని ఎత్తిపొడిచాను.

'చెప్పారు తెద్దురూ, నెల్లూరు తెలుగు గడ్డలో వుందంట. మా బెజవాడ దాటాక అంతా సాంబార్ కంపే' నంటూ అప్పారావు నన్ను ఖండించాడు.

అప్పారావు, రంగారావులు బెనారస్‌లో పరీక్ష లిచ్చి బెజవాడ మీదుగా వాళ్ల స్వస్థలాలకి వెళ్తున్నారు. యువకులు. అరవలపొత్తు గిట్టదు. వాళ్లని నిందించి ప్రయోజనం లేదు. మనదేశం దౌర్భాగ్య స్థితే అంత. రైలు ఎవరి రాష్ట్రం పొలిమేరలు చేరుకుంటే, ఆ రాష్ట్ర ప్రజలు ఇతర్ల మీద ప్రాభవం చెలాయిస్తారు. కొద్దీ గొప్ప తారతమ్యాలలో అందర్నీ ఈ జాడ్యం పీడిస్తుందనే నా అభిప్రాయం.

ఢిల్లీ నుంచి బయలుదేరాక రామానుజం గారు, నేనూ ఎన్నో విషయాలు ముచ్చటించుకొన్నాం. అన్నింటిలోనూ మాకు ఏకాభిప్రాయం కుదర్లేదు. భాషననుసరించి రాష్ట్రాలు విభజింపబడటం నెహ్రూజీ తెలివి తక్కువదనం, ముందుచూపు లేమికి తార్కాణం అని అభిప్రాయపడ్డారు. వోగుల కంటె బాగులే ఎక్కువని నేను వాదించాను. ఆ ప్రసక్తి వదిలి తతిమ్మా విషయాలెన్నో వయస్సు భేదం పాటించకుండా నిర్మొహమాటంగా మాట్లాడుకొన్నా మా గౌరవాలకి భంగం కలుగజేసికోలేదు. అప్పారావు, రంగారావుల ప్రసంగానికి లోనయి, రామానుజంగారు చిన్న బోవటం నాకు బాధాకరమయింది ఆయన ఎవరయితేనేమిటి? తోటి మానవుడు. భాష తెలీకపోయినా, నా రీయాక్షన్ అర్థం చేసికొన్నట్లే రామానుజంగారు కనబడ్డారు.

రైలుకి రాజకీయాలతో, మా మల్లగుల్లాలతో సంబంధంలేనట్లు వెళ్లిపోతున్నది. సర్వ ప్రయాసలకీ లోనవుతూ ఎలాగయితేనేం బెజవాడ చేరుకొన్నాం. కొండపల్లి స్టేషన్నుంచే తమ ఊళ్ళు వచ్చేసినట్లు రావులిద్దరూ సంతోషించారు. రైలు దిగిపోతూ వాళ్లిద్దరూ రామానుజంగారి వైపు చులకనగా చూశారు. అలాంటి ప్రబుద్ధులు తోటి ప్రయాణికులుగా తటస్థపడ్డందుకు నేనెంత నొచ్చుకొన్నానో నాముఖ కవళికల ద్వారా తెలియజేశాను. వాళ్లు నన్ను ఖాతరు చేయలేదు.

బెజవాడ స్టేషనులో మాకంపార్టుమెంటులోకి మరోవ్యక్తి ప్రవేశించాడు. నడివయస్సులో యుండి, నావలీకంగానే యున్నా అతనిలో రౌడీ లక్షణాలు మూర్తీభవించి యున్నాయి. అలాంటి వ్యక్తులు తమ రాష్ట్రానికి సంబంధించని వారయితే బాగుండునని ఎవరికయినా అనిపిస్తుంది. రామానుజంగారి దురదృష్టము, రౌడీకళ్లు ఆయనమీదే పడ్డాయి; నా దురదృష్టం, ఆ రౌడీ ఆంధ్రుడు కావటం మనిషినుంచి సారావాసన ఘుమాయిస్తున్నది. బోగీ ఖాళీగానే యుంది. అయినా రామానుజంగారు కూర్చొనియుండే కిటికీదగ్గరే తిష్టవేసుకొన్నాడు, రౌడీ సిగరెట్టు వెలిగించి ముఖం మీదికి పొగవదుల్తూ 'ఎందాకా ప్రయాణం' అని అగ్గిపుల్ల గిరవాటేస్తూ, నిర్లక్ష్యంగా ప్రశ్నించాడు.

'ఎన్నా? ఎన్నా?' అన్నారు ప్రశ్న అర్థంకాక రామానుజంగారు.

'ఒహో! అరవపైత్తికాడివా?' అని అనుమానం తీర్చుకొన్నాడు. నేసింతా చూస్తునే యున్నాను. రామానుజంగారు పొగబాధ భరించలేక 'నాయనా! అటువైపు వెళ్లికూర్చో నీకు పుణ్యం వుంటుంది' ని ప్రాధేయపడ్డారు. రౌడీ విసీ, వినిపించుకోకుండా పొగని చక్రాలుగా వదుల్తున్నాడు.

నేను కలుగజేసికొని: 'ఆయనమీద పొగ వదలకపోతే అటెళ్లి కూర్చోగూడదుటయ్యా?' అని రామానుజంగారిని సమర్థించాను. విన్నాడు, కాదు,

## సర్వత్రా సర్వదా సర్వథా

'ఆయన కూచున్నచోటు' నాది సరా' అని ఫీషిస్మించుకొన్నాడు.

రామానుజంగారు అనునయంగానే 'నాకు నీ సిగరెట్ల కంపు, సారావాసన భరించడం కష్టంగాయుంది. అంచేతనన్నా నీవు అక్కడికెళ్ళి కూర్చో' అని తనబాధని అభినయంద్వారా వ్యక్తం చేశారు.

రౌడీ బయటపడ్డాడు: 'హారేయ్ నీవు ఎవ్వడా నన్ను లెమ్మంటానికి? బెడవాడ్నుంచీ నెల్లూరివరకూ నాదిరా, రాజ్యం. టిక్కెట్టు లేకుండా తిరిగినా, ఏ ఒక్క లంజకొడుకూ ఎందు కెక్కావని అడగరు. తెల్సా! గట్టిగా మాట్లాడితే మొత్తుతాను. జాగ్రత్త' అని బెదరించాడు.

నిషాలో వున్నాడేమో, వెధవని సీరియస్‌గా తీసికోగూడదని అనుకొన్నాను కాని వాళ్ళ తెలిసే మాట్లాడుతున్నాడు. రామానుజం గారు ధైర్యంచేసి 'నీవు లేవక తప్పదు.' అని తీవ్రంగా అన్నారు. రౌడీ ఆయన్ని మెడమీద చేయివేసి బలవంతంగా తలుపు దగ్గరికి నెట్టి 'హారేయి. ఇక్కడ కాదురా నీ ప్రతాపం గుమ్మడిపూండిదగ్గర. ఒక్క రేపటున్నారు, నీ జెజెనాయాలు. అంతవరకూ కాళ్ళకింద చెప్పులాగ వుండు.' అని ప్రగల్భాలుకొట్టాడు. సజ్జనుడికి నోరు గుండెలో వుంటుందంటారు. రామానుజంగారు తల వంచారు.

నేను తలపంచలేదు. మర్యాదగా అన్నాను: 'నీవు అక్కడ్నుంచి లేవకపోతే నెట్టించాల్సి వస్తుంది.'

'నీ తాతతో చెప్పుకో' అన్నాడు, మరి ఇహ అప్పీలులేనట్లు.

టిక్కెట్టు కలక్టరువచ్చి మా టిక్కట్లని తనిఖీచేశాడు. రవుడీగాడి టిక్కెట్టు తనికీచేస్తాడేమోనని ఆశించాను. అలా జరుగలేదు.

'ఏం, సామీ? బాగుండావా?' అని రవుడీ పలుకరించాడు.

'ఆఁ నీదయ' అని ముక్తసరిగా సమాధానమిచ్చాడు, టిక్కెట్టు కలక్టరు.

'ఆయన టిక్కెట్లు ఎందుకని తనిఖీ చేయలేదు?' అని ప్రశ్నించాను టిక్కెట్టు కలక్టరుని, మరచాడేమో అన్న అనుమానంతో, రవుడీ దగ్గర టిక్కెట్టులేదనే విశ్వాసంతో.

'మీకెందుకు? అది నా గొడవ' అని మొండి సమాధానం యిచ్చాడు.

'అదేం సబబండీ' అని వాదించాను.

'సబబూలేదు. సబ్బూలేదు. ఈరోజే కాదు; ఏరోజూ తనిఖీ చేయను.'

'ఎందుకని.'

'మీ కనవసరం.'


ఈయనకూడ అప్పీలు లేకగొట్టేడు. 'ఇప్పుడేవంటావు' అన్నట్లు రవుడీ నావంక చూశాడు. ఎవర్ని నిందించాలో తోచలేదు. బోగీలో తతిమ్మావాళ్ల టిక్కెట్లని తనిఖీ చేసి టిక్కెట్టు కలెక్టరు వెళ్ళిపోయాడు.

'మనకెందుకు బాబూ, వాడి మానాన్న వాడిని పోనీండి. లోకవంతా అట్లాగేవుంది' అని ఒక ముసలాయన నాకు సలహాయిచ్చాడు. నాకు ఉద్రేకం వచ్చింది అన్యాయాన్ని ప్రతిఘటించాలి. నాకు కాదని కూర్చోలేక పోయాను ఆంధ్రదేశం నడిగడ్డలో ఒక వ్యక్తికి ఇంతటి అన్యాయం జరగటం నేను సహించలేక పోయాను. తర్కించుకొన్నాను. ఎవరిది న్యాయం? ఎక్కడుంది, న్యాయం? ఒక నిశ్చయానికి వచ్చాను. బాపట్ల స్టేషనులో మా దూరపుబంధువు స్టేషన్ మాస్టరుగా వున్నట్లు గుర్తు. ఆయన సహాయం అర్థించి, ఈ రవుడీ చేత తగిన గడ్డి తినిపించాలి. రెండుదినాలుగా రామానుజంగారికి జరిగిన అన్యాయానికి ప్రాయశ్చిత్తం ఆంధ్రదేశం పొలిమేర దాటకుండానే జరగాలి. రంగారావు, అప్పారావులు తప్పించుకొన్నారు; ఈ రవుడీ తప్పించుకోవటానికి వీల్లేదు.

బాపట్ల స్టేషను రానే వచ్చింది. వెంటనే దిగి, మా దూరపు బంధువుకి అంతా టూకీగా చెప్పి, రవుడీని చూపిస్తూ 'ఈ బాడ్ కారెక్టర్‌ని, టిక్కెట్టు లేని ప్రయాణికుని, మీ కస్టడీలోకి తీసికోండి' అని కోరాను. తగిన బందోబస్తుతో వచ్చి రవుడీని తమ స్వాధీనం చేసుకొన్నారు. ఇంత జరుగుతుందని రవుడీ ఊహించలేక పోయాడు: 'బద్మాష్! ఇంతపని చేస్తావ్. నీవూ, నేనూ ఈ లైన్లో కల్సుకోక పోతాం? అప్పుడు చూడు, నా తడాఖా!'

నేను మాట్లాడలేదు.

రైలు కదిలే వేళయింది. టిక్కెట్టు లేకుండా ప్రయాణించే లపరాధుల్ని స్టేషన్ మాస్టరికి లప్పచెప్పి, ఆ టిక్కెట్టు కలెక్టరే మరో కంపార్టుమెంటులోకి ఎక్కాడు.



వాకు నవ్వొచ్చింది, టికెట్కొట్టు కలక్టరుగారి డబుల్ స్టాండర్డ్సుకి.

మా బంధువులనుంచి 'వస్తానని' 'సెలవు తీసికొంటూండగా రవుడీ, నాతో 'తెలుగోడి వయ్యుండి ఇంకో తెలుగోడికి అన్యాయం చేస్తావ్ ! ఆ అరవపోడు నచ్చాడూ ? చిత్రంగానేయుంది'అని ఈసడించుకున్నాడు.

'నీవు రామానుజం అంత మంచివాడ వయ్యుంటే నిన్నే సమర్థించేవాడినని' జదులిచ్చాను. మాట విన్నాడో లేదో, మలుపు తిరిగి అదృశ్యమయ్యాడు,పోలీసు బృందంతో.

కంపార్టుమెంటులో రామానుజంగారికి అంతా వివరించాను.

'నా ప్రాణం దక్కించావు. నీకు నా కృతజ్ఞత వెల్లడించుకుంటున్నాను' అని ఆగి 'తెలుంగువాళ్లు మంచివాళ్లు' అని తెలుగు జాతినే మెచ్చుకొన్నారు.

'అవును, మరి కారాలు, మిరియాలు రుచి చూచారు. తెలుగువారి మంచిదనం రుచి చూడకుండా మా పొలిమేరదాటితే మా కపకీర్తి కదూ. మా మనస్సు తీపిదనం రుచి చూశారుగా. అందరికీ పంచండి' అని భావోద్రేకంతో అన్నాను.

'మీ ఆవకాయో?' అన్నారు, తులిపిగా.

'నయం. ఢిల్లీ కాస్మోపాలిటన్ ఆవకాయ రుచి చూచి యుంటారు, ఈపాటికి. 'ఇంటీరియర్ ఆంధ్ర ఆవకాయ' రుచి చూశారు, కారు. అదృష్టవంతులు' అని ఆవకాయ రహస్యం వివరించాను. రామానుజంగారు ఆప్యాయంగా నవ్వారు.

ఒక సాంబార్‌గాడు నెల్లూరిలో దిగాడు.

ఇంటికెళ్ళాక మా మేనగోదలికి నేనిచ్చిన హామీ గుర్తుకొచ్చింది. ఆలస్యం చేయకుండా:

'చేయగల్గిన మంచి
సర్వత్రా, సర్వథా
అందరికీ, సర్వదా
నీ శక్తివంచనలేక చేయి, తల్లీ!'
—నీ మామ.

అని వ్రాసి పోస్టు చేశాను. ●




వాడండి

ప్లూరో కార్బన్ అంచు గల

ప్రిన్స్ బ్లూ బ్లేడ్

ఋతుక్రమం ఆలస్యమైతే ?

విచారపడవద్దు ప్రఖ్యాతిగాంచిన "దేవిపిల్సు" వాడండి

'దేవి పిల్సు ముఖ్యంగా ఆలస్యమైన, క్రమముగాకాక పోయిన, బాధతోకూడిన, లేక ఆగిపోయినబహిష్టకు దేవిపిల్సు బాగుగ గుణమిచ్చును




1 అన్ని సందర్భములలోను శీఘ్రముగాను, అమోఘముగాను పనిచేయును ..
2 ఏస్థితిలోను ఆరోగ్యమునకు ఎట్టిహాని కలిగింపదు

FULL COURSE 28 TABLETS Rs 11/-
HALF COURSE 14 TABLETS Rs 6.50

ప్రతిచోటదొరకును

Mfrs:- SEENU & Co., MADRAS-81

Available at all leading Chemists & Druggists.